క్లుప్తంగా

రెవెన్యూ గ్రామసభ


మాట్లాడుతున్న తహసీల్దార్ ఈశ్వరయ్య

లింగాల : మండలంలోని రామన్నూతనపల్లె లో గురువారం మండల రెవెన్యూ అధికారులు రెవెన్యూ గ్రామసభలు నిర్వహించారు. గతంలో నిర్వహించిన సమగ్ర భూ సర్వేలో ఉన్న పట్టాదారు పాసు పుస్తకంలో లోటుపాట్లను సవరించేందుకు రైతుల వద్ద నుంచి దరఖాస్తులను స్వీకరించారు. పట్టాదారు పాసుపుస్తకంలో పేరు, తండ్రి పేరు, భర్త పేరు తదితర వాటిలో దొర్లిన తప్పులను సవరించేందుకు రైతులనుంచి తహసీల్దార్ ఈశ్వరయ్య వివరాలను సేకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ జగన్‌మోహన్ రెడ్డి, మండల సర్వేయర్ పార్వతి, వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు, రైతులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు


పారిశుద్ధ్య పనులు చేపడుతున్న సిబ్బంది

తొండూరు : మండలంలోని ఇనగలూరు గ్రామంలో గురువారం సర్పంచ్ గుజ్జుల గంగయ్య ఆధ్వర్యంలో పారిశుద్ధ్య సిబ్బంది మురికి కాలువల్లో ఉన్న చెత్తను తొలగించారు. రహదారులపై నిలిచిన నీటిని తొలగించి దోమలు వ్యాప్తి చెందకుండా బ్లీచింగ్‌ను చల్లారు.

దోమల నియంత్రణతో రోగాల నివారణ

వల్లూరు (చింతకొమ్మదిన్నె) : చింతకొమ్మదిన్నె మండల పరిధిలోని ఆజాద్‌నగర్‌లో మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగలక్ష్మిరెడ్డి, చింతకొమ్మదిన్నె ఆరోగ్య అధికారి సుకుమారన్ సంయుక్త పర్యవేక్షణలో మురికినీటి కుంటలలో వేస్ట్ ఆయిల్ బాల్స్ వేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య అధికారి మాట్లాడుతూ దోమల నియంత్రణకు అధికారులు చేపడుతున్న కార్యక్రమాలు విజయవంతం కావాలంటే ప్రజల సహకారం చాలా అవసరమని, ప్రజలు ఆరోగ్యం పైన పరిసరాల పరిశుభ్రత పైన అవగాహన పెంపొందించుకుని వ్యాధులను దూరం చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య శాఖ పర్యవేక్షకులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో మంచిపౌష్టికాహారం


స్టాల్‌ను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్

జమ్మలమడుగు : తక్కువ ఖర్చుతో మంచిపౌష్టికాహారాన్ని మెప్మా సంఘ సభ్యులు తయారు చేసి వాటిని ప్రజలకు విక్రయించి ఆర్థికంగా బలోపేతం అవ్వాలని మున్సిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ తెలిపారు. గురువారం మెప్మా ఆధ్వర్యంలో స్థానిక పాతబస్టాండ్‌లోని మెప్మా బజార్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మెప్మా సంఘ సభ్యులు వివిధ రకాల వస్తువులను తయారు చేసి ప్రజలకు తక్కువ రేటుకు అమ్మడం ద్వారా ఆదాయం పెరిగే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ ఇన్‌చార్జి భూపేష్, మెప్మా అధికారులు, ఎన్‌డీఏ కూటమి నాయకులు పాల్గొన్నారు.

కాలువ శుభ్రం

వల్లూరు (చింతకొమ్మదిన్నె) : బుగ్గవంక డ్యాంకు నీరు పుష్కలంగా వస్తుండటంతో డ్యాం నుంచి నీటిని రెడ్డి చెరువుకు చేర్చేందుకు చెరువు కాలువను ఇరిగేషన్ ఏఈ జేసీబీతో శుభ్రం చేయించారు.

రాష్ట్ర కమిటీ సమావేశాలు జయప్రదం చేయండి


కరపత్రాలను విడుదల చేస్తున్న డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్

ఎర్రగుంట్ల : భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డీవైఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ సమావేశాలు ఈనెల 29 ,30వ తేదీలలో కడప వేదిగా జరుగుతున్నాయని వాటిని జయప్రదం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ తెలిపారు. గురువారం ఎర్రగుంట్ల ఐటీఐ కళాశాలలో కరపత్రాలను వారు విడుదల చేశారు. ఈ సమావేశాలకు అఖిల భారత అధ్యక్షుడు రాజ్యసభ సభ్యులు ఎంపీ రహీమ్ ము ఖ్య అతిథిగా హాజరు అవుతున్నారన్నారు.

పరామర్శ

వేంపల్లె : స్థానిక క్రిస్టియన్ కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త గొర్లపల్లె ప్రసాద్ గురువారం అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్ కుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ ఎం.రవికుమార్‌రెడిలు పరామర్శించారు.

చీనీకి తెగులు.. రైతుకు దిగులు

- తెగుళ్లతో చీనీ చెట్లను నరికి వేస్తున్న రైతులు
- తగ్గిన చీనీ ధరలు.. ఆందోళనలో రైతులు

సింహాద్రిపురం : పులివెందుల నియోజకవర్గంలో చీనీ పంట సాగుకు సింహాద్రిపురం మండలం ప్రసిద్ధి. ప్రస్తుతం చీనీ చెట్లకు తెగుళ్లు సోకడంతో రైతులు చెట్లను నరికివేస్తున్నారు. దీనికితోడు చీనీ ధరలు పతనం కావడంతో చీనీ రైతులు ఆందోళన చెందుతున్నారు. పదేళ్ల క్రితం టన్ను కాయలు రూ.60వేల నుంచి లక్ష వరకు పలికాయి. నాలుగేళ్ల నుంచి టన్ను కాయలు రూ.10వేల నుంచి రూ.25 వేలలోపు పలుకుతున్నాయి. పంటల సాగులో పెట్టుబడులు పెరగడంతోపాటు చీనీ చెట్లలో తెగుళ్ల నివారణకు మందుల పిచికారి కోసం వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోంది.

చీనీచెట్లకు తెగుళ్లు

ప్రస్తుత వర్షాకాలంలో చెట్లకు తెగుళ్లు సోకి చనిపోతున్నాయి. చెట్లకు పొలుసు పురుగు చెట్టు మొదలుకు సోకి బీడు బ్యాక్టీరియా ద్వారా ముందు చెట్టు పీచు వేరుకు సోకి చెట్టు బెరడుకు ఎగబాకడంతో చీనీ చెట్లు చనిపోతున్నాయి. తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టినా తెగుళ్లు అదుపు కాక చెట్లు చనిపోతున్నాయి. చీనీ చెట్లకు తెగుళ్లు సోకి ఎండిపోతున్నా శాస్త్రవేత్తలు కానీ, అధికారులు కానీ అటువైపు కన్నెత్తి చూడటంలేదని రైతులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో చీనీ రైతులు చెట్లను నరికివేసి అరటి, దానిమ్మ పంటలను సాగు చేసుకునేందుకు సన్నద్ధమవుతున్నారు.

గత ప్రభుత్వంలో రైతులకు ఎంతో మేలు :

గత ప్రభుత్వంలో తెగుళ్లకు చీనీ చెట్లు దెబ్బతింటే ఎకరాకు రూ.10వేలు నష్టపరిహారం అందించే


తెగులు సోకడంతో చీనీ చెట్లను నరికివేసిన రైతులు

వారు. ప్రస్తుతం కూటమి సర్కార్ చీని చెట్లు తెగుళ్లకు దెబ్బతిన్నా ఎటువంటి పరిహారం అందించలేదని రైతులు వాపోతున్నారు. అలాగే గత ప్రభుత్వం రైతులకు మేలు చేయాలన్న ఉద్దేశ్యంతో పులివెందుల వ్యవసాయ మార్కెట్ యార్డులో డబుల్ సూట్ లేకుండా రైతులు నేరుగా చీనీ కాయలు అమ్ముకునేలా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం దళారులు సిండికేట్‌గా ఏర్పడి చీనీ కాయల ధరలను తగ్గిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని చీనీ రైతులు వాపోతున్నారు. గతంలో ధరలు బాగా ఉండటంతో సింహాద్రిపురం మండలంలో చాలామంది రైతులు చీనీ పంటను సాగు చేశారు.


సింహాద్రిపురంలో తెగుళ్లు సోకి ఎండుతున్న చీనీ చెట్టు

తగ్గిన చీనీ పంట సాగు

2023-24 సంవత్సరంలో 18,156 ఎకరాలలో పంట సాగులో ఉండగా.. ప్రస్తుతం 16,830 ఎకరాలలో పంటను సాగు చేశారు. అలాగే 2023-24లో అరటి పంట 470 ఎకరాలలో సాగులో ఉండగా.. ప్రస్తుతం 1450 ఎకరాలలో సాగులో ఉంది.

చీనీ రైతులను ఆదుకోవాలి



ఈ ఏడాది అకాల వర్షంతోపాటు ఎండ తీవ్రతకు చీనీచెట్లకు తెగులు సోకి చనిపోతున్నాయి. చాలా రైతుల పొలాల్లో ఇదే పరిస్థితి. దళారుల మోసంవల్ల చీనీ కాయల ధరలు పతనమయ్యాయి. ప్రభుత్వం వెంటనే దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలి. అలాగే అనంతపురం నుంచి ఢిల్లీకి ఎగుమతుల కొరకు వారంలో ఒకసారి ప్రత్యేక రైలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

– వి.అరవిందనాథరెడ్డి, మండల వ్యవసాయ సలహాదారు, సింహాద్రిపురం

నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



ఇటీవల కురిసిన వర్షాలకు చీనిచెట్లలో నీటిశాతం ఎక్కువై పులుసు తెగులు సోకి చెట్లు చనిపోతున్నాయి. చాలా రైతుల పొలాల్లో ఇదే పరిస్థితి. దీనికితోడు కాయల ధరలు పతనమయ్యాయి. ఎంతో కష్టపడి పెంచుకున్న చెట్లు కళ్ల ముందరే దెబ్బతినడంతో బాధగా ఉంది. ఇప్పటికైనా చీనీ రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలి.

– పుల్లారెడ్డి,చీనీ రైతు, సింహాద్రిపురం

రైతులను ఆదుకుంటాం

కమలాపురం : అకాల వర్షాల వలన పంట నష్టపోయిన రైతులందరికి నష్ట పరిహారం అందించి ఆదుకుంటామని ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి తెలిపారు. గురువారం పట్టణ శివారులోని గంగవరం గ్రామ పొలాల్లో వరద వలన దెబ్బతిన్న వరి పంటను ఆయన అధికారులతో కలసి పరిశీలించి మాట్లాడారు. రెండు రోజుల్లో పంట నష్టాన్ని అంచనా వేయాలని అధికారులకు సూచించారు. దాదాపు 250 ఎకరాల వరకు వరి పంట నేల వాలిందని, మొసులు కూడా వచ్చాయని అధికారులు తెలిపారు. పంట నష్ట నివేదికను సిద్ధం చేయగానే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నష్ట పరిహారం అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఏడీఏ నరసింహారెడ్డి, ఏఓ సరస్వతి, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. అలాగే 15వ ఆర్థిక సంఘం నిధులతో రామ్ నగర్ నుంచి బీడికాలనీకి ఏర్పాటు చేయనున్న పైప్‌లైన్‌కు శంఖుస్థాపన చేశారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి

పులివెందుల టౌన్ : పట్టణంలోని పాత మార్కెట్ ఆంజనేయస్వామి ఆలయం వద్ద డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, రాష్ట్రీయ శివాజీసేన కడప జిల్లా అధ్యక్షుడు కోప్పల శ్రీనివాస్‌రెడ్డి మున్సిపల్ కమిషనర్ రాముడుకు గురువారం వినతి పత్రం అందించారు. డ్రైనేజీ అస్తవ్యస్తంవల్ల మురుగు నీరు అంతా ఆలయంలోకి ప్రవేశించి భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే డ్రైనేజ్ సమస్యకు శాశ్వతంగా పరిష్కారం చూపాలన్నారు. కమిషనర్ రెండు రోజుల్లో పనులు చేపట్టి డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తామన్నారు.

సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం విఫలం


ప్రజల సమస్యలను వింటున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల రూరల్ : ప్రజా సంక్షేమ పథకాలు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని, రాబోయే రోజులు మళ్లీ మనవేనని ఎంపీ అవినాష్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన నివాసంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. తమ సమస్యలను చెప్పుకునేందుకు వచ్చిన కార్యకర్తలు, ప్రజలతో ఆయన మమేకమై వారి సమస్యలను సావధానంగా విని పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోలేకపోతుందని, ఇచ్చిన హామీలు కూడా నెరవేర్చలేదన్నారు. మళ్లీ మనకు మంచి రోజులు వస్తాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలపై దృష్టి సారించండి


మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ, సీఐ

పులివెందుల రూరల్ : మండలంలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ వరలక్ష్మి తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఎంపీడీఓ రామాంజనేయరెడ్డి ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీపీ హాజరై మాట్లాడుతూ గ్రామాల్లో రోడ్లపై చెత్తా చెదారాలు దర్శనమిస్తున్నాయని.. మురుగునీరు రోడ్డుపై ప్రవహించకుండా గ్రామాల్లో కాలువలు ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో తాగునీరు, వీధిలైట్ల సమస్యలపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అర్బన్ సీఐ జీవన్ గంగానాథ్ బాబు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలతోపాటు పట్టణాల్లో కూడా చోరీలు జరుగుతున్నాయని.. ప్రతి ఒక్కరూ ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతుంటే వెంటనే పోలీసులకు సమాచారమందించాలన్నారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయండి


సమస్యలపై చర్చిస్తున్న ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి

కమలాపురం : అధికారులు, కౌన్సిలర్లు సమన్వయంతో పనిచేసి ప్రజల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే చైతన్యరెడ్డి తెలిపారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్ పర్సన్ మార్పురి మేరి అధ్యక్షతన మున్సిపల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అజెండాలను పలు అంశాలను ఆమోదించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న సమస్యలను అధికారులు, కౌన్సిలర్లు సమన్వయంతో పని చేసి పరిష్కరించాలన్నారు. ఇందిరమ్మ కాలనీ, పుట్లంపల్లె యానాదీ కాలనీ, అరవింద్ నగర్ తదితర ప్రాంతాల్లో తాగునీటికి ఇబ్బంది పడుతున్నట్లు స్థానికులు చెప్పడంతో ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా చూడాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారులపై ఉందన్నారు. అలాగే సీజనల్ వ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లడం, ఫాగింగ్ చేయడం చేయాలన్నారు. కమిషనర్ జగన్నాథ్ మాట్లాడుతూ ఆస్తి పన్ను వసూలుకు కౌన్సిలర్లు సహకరించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివరామిరెడ్డి, వైస్ చైర్మన్ మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సబ్ జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్ పరిశీలన


ఖైదీలకు హక్కుల గురించి చెబుతున్న జడ్జి బాబా ఫక్రుద్దీన్

పులివెందుల రూరల్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశానుసారం సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్ గురువారం పులివెందుల సబ్ జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యతను గురించి తెలియజేశారు. జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100పై ప్రచారం నిర్వహించారు. ఏవైనా సమస్యలుంటే రాయచోటి మండల న్యాయ సమితి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థలను సంప్రదించవచ్చునన్నారు. కార్యక్రమంలో పులివెందుల సబ్‌జైల్ సూపరింటెండెంట్, ఖైదీలు పాల్గొన్నారు.

కార్ల డిజైన్లలో రోబోటిక్స్ ఎంతో ప్రాముఖ్యత


బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న యూసీఐఎల్ మెకానికల్ హెడ్ చంద్రశేఖరరెడ్డి, తదితరులు

పులివెందుల రూరల్ : ఎఫ్3 కార్ డిజైన్లలో రోబోటిక్స్ ఎంతో ప్రాముఖ్యత ఉందని యూసీఐఎల్ మెకానికల్ హెడ్ చంద్రశేఖరరెడ్డి తెలిపారు. పట్టణంలోని స్థానిక జెఎన్‌టీయూ కళాశాలలో గురువారం యంత్ర 2కె24 జాతీయ సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు తుమ్మలపల్లె యూసీఐఎల్ మెకానికల్ హెడ్ చంద్రశేఖరరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఎఫ్ఆ కార్ డిజైన్, రోబోటిక్స్ పాత్ర ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అరుణ కాంతి, వైస్ ప్రిన్సిపాల్ సుబ్బారెడ్డి, మెకానికల్ విభాగాధిపతి ప్రొఫెసర్ వి.వేణుగోపాల్‌రెడ్డి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రూ.20 వేల విరాళం

పులివెందుల టౌన్ : పట్టణంలో స్నేహిత అమృత హస్తం సేవాసమితి నిర్మించనున్న నూతన భవన నిర్మాణానికి పబ్బతి రాధాకృష్ణ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు దక్షిణామూర్తి రూ.20వేలను సేవా సమితి అధ్యక్షుడు రాజుకు విరాళంగా అందించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ నూతన భవన నిర్మాణం కొరకు విరాళాలు అందించాలనుకునేవారు 9966509364 అనే నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

రైతుల నిరసన

వల్లూరు (చింతకొమ్మదిన్నె) : విజిలెన్స్ వారోత్సవాల సందర్భంగా పవర్ గ్రిడ్ అధికారులు కొలుములపల్లి సచివాలయంలో గ్రామ ప్రజలతో సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పవర్ గ్రిడ్ డీజీఎం హరివెంకట కుమార్ మాట్లాడుతూ భవిష్యత్తు సమాజం నైతిక విలువలు కలిగి దేశం యొక్క సమగ్ర అభివృద్ధి కోసం చైతన్యవంతమైన పౌర సమాజం అవసరమన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన రైతులు తమ భూములు జాతీయ రహదారికి ఆనుకునే ఉన్నాయని, అనంతపురం-కడప 400 కె.వి విద్యుత్ లైన్ జాతీయ రహదారికి ఆనుకునే మూడు కిలోమీటర్ల పాటు రహదారికి సమాంతరంగా వెళ్లే విధంగా డిజైన్ చేశారన్నారు. రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. పవర్ గ్రిడ్ అధికారులకు ఇదివరకే రైతులు కంప్లైంట్ చేసినప్పటికీ పట్టించుకోలేదన్నారు. విద్యుత్ లైను చింతకొమ్మదిన్నె గుట్ట మీద నుంచి వెళ్లే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలని రైతులు నిరసన తెలిపారు. పవర్ గ్రిడ్ డీజీఎం మాట్లాడుతూ సంబంధిత ఉన్నతాధికారులకు తెలుపుతామన్నారు.

అనధికార కొళాయిలను రెగ్యులర్ చేయించాలి


సచివాలయ సిబ్బందితో సమీక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్ రాముడు

పులివెందుల టౌన్ : మున్సిపాలిటీ పరిధిలో అనధికార కొళాయిలను రెగ్యులర్ చేయించాలని మున్సిపల్ కమిషనర్ రాముడు సిబ్బందికి సూచించారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన సచివాలయ అడ్మిన్, అమెనిటీ సెక్రటరీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆస్తి పన్ను, నీటి పన్ను, ఇళ్లు తదితర విషయాలపై చర్చించారు. సచివాలయ సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ చిదానందరెడ్డి, ఆర్ఐ మునికుమార్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

పెద్దముడియం : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో షెంషాద్‌భాను ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. మూడు నెలల కాలంలో ఆయా శాఖల పరిధిలో జరిగిన పనులకు సంబంధించి సమగ్ర నివేదికతో అధికారులు సమావేశానికి హాజరు కావాలని తెలిపారు.

సమాజ సేవకు యువత పాటు పడాలి


వ్యాసరచన పోటీలను పరిశీలిస్తున్న సీఐ, ఎస్ఐ

కమలాపురం : సమాజ సేవకు యువత పాటు పడాలని కమలాపురం సీఐ ఎస్‌కే రోషన్, ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు పోలీస్ సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కమలాపురంలోని జడ్పీ బాయ్స్, గరల్స్ పాఠశాలలను వారు సందర్శించారు. విద్యార్థులకు ×సైబర్ నేరాల నిర్మూలనలో యువత పాత్ర౯ అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో సైబర్ నేరాలు ఎక్కువయ్యాయన్నారు. వాటిని నియంత్రించడంలో యువత పాత్ర కీలకం అన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు సైబర్ నేరాల పట్ల అవగాహన ఉండదని, విద్యార్థులు, యువకులు వారిని సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించాలన్నారు. విధుల్లో అమరులైన పోలీసులను వారు స్మరించుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సమాజ సేవ ముఖ్యమే

శాంతి భద్రతల పరిరక్షణే కాదు సమాజ సేవ కూడా ముఖ్యమేనని నిరూపించారు కమలాపురం సీఐ ఎస్‌కే రోషన్, ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి. పట్టణంలోని బాయ్స్ హైస్కూల్‌లోని ప్లే గ్రౌండ్ వరద నీటితో నిండింది. విద్యార్థులు ప్రేయర్ చేయడానికి కూడా వీలులేని పరిస్థితి నెలకొంది. పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఈ విషయాన్ని సీఐ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన వారు గురువారం జేసీబీ ద్వారా ప్లే గ్రౌండ్‌లోని నీరంతా బయటకు వెళ్లేలా చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

భూ నిర్వాసితులకు న్యాయం చేయాలి


ఆర్టీపీపీ సీఈ గౌరీపతికి వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ, ఏఐవైఎఫ్ నాయకులు

ఎర్రగుంట్ల : రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటు కోసం వివిధ దశలలో భూములు కోల్పోయిన భూ నిర్వాసితులకు న్యాయం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పొన్నశివయ్య, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి గంగాసురేష్‌లు తెలిపారు. గురువారం ఆర్టీపీపీలోని భూ నిర్వాసితులతో కలసి ఆయన ఆర్టీపీపీ సీఈ గౌరిపతికి వినతిపత్రం అందజేశారు. భూ నిర్వాసితులకు 50 శాతం ఉద్యోగాలు కల్పిస్తామని జీవో 98 లో స్పష్టంగా ఉన్నప్పటికీ ప్రభుత్వ ఉత్తర్వులను జెన్‌కో యాజమాన్యం అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ఆర్టీపీపీలో జూనియర్ ప్లాంట్ అసిస్టెంట్ (జేపీఏ) ఉద్యోగాలు వందలాది ఖాళీగా ఉన్నాయన్నారు. అయితే ఇప్పటి వరకు నోటిఫికేషన్ విడుదల చేయలేదన్నారు. మరోవైపు దొడ్డిదారిన నోటిఫికేషన్ లేకుండా ఉద్యోగాలు భర్తీ చేస్తూ భూ నిర్వాసితుల పొట్టకొడుతున్నారన్నారు. తక్షణమే భూ నిర్వాసితులకు ఉద్యోగాలు కల్పించాలన్నారు.

పెన్నానదిలో పెరుగుతున్న వరద నీటి ప్రవాహం


పెన్నానదిలో ప్రవహిస్తున్న వరద నీరు

జమ్మలమడుగు : పెన్నానదిలో మైలవరం జలాశయం నుంచి విడుదల అవుతున్న వరద నీటి ప్రవాహం కొనసాగుతూనే ఉంది. ఇరిగేషన్ అధికారులు బుధవారం సాయంత్రం నుంచి 11 వేల క్యూసెక్కుల నీటిని దిగువనున్న పెన్నానదిలోకి విడుదల చేశారు. గురువారం కూడా ఇదే ఉధృతిని కొనసాగుతోంది. గండికోట జలాశయం నుంచి 11 వేల క్యూసెక్కుల నీరు మైలవరం జాలాశయంలోకి అధికారులు విడుదల చేశారు. ప్రజలు పెన్నానది పరివాహక ప్రాంతాలలోకి వెళ్లకూడదని అధికారులు ఇప్పటి కే హెచ్చరికలు జారీ చేశారు.

రుణాలు మంజూరు చేయిస్తాం

పులివెందుల రూరల్ : కమ్యూనిటీ సభ్యులకు పొదుపు సంఘాల ద్వారా రుణాలు మంజూరు చేయిస్తామని జిల్లా జడ్జి బాబాఫకృద్దీన్ తెలిపారు. గురువారం పట్టణంలోని సీడీఎస్, ఎన్‌జీవోల ఆధ్వర్యంలో న్యాయ సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు జిల్లా జడ్జి హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో సీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఏసురత్నం, ప్రాజెక్టు మేనేజర్ వలి, డాక్టర్ శాంతకుమార్, ఐసీటీసీ కౌన్సిలర్ వెంకటసుబ్బయ్య, సీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మహబూబ్ సుబహాని ఉరుసు


జెండాను ఊరేగిస్తున్న భక్తులు, నిర్వాహకులు

కమలాపురం : పట్టణంలోని పడమట వీధిలో వెలసిన హజరత్ మహబూబె సుబహాని, ఖుత్బే రబ్బాని, అబ్దుల్ ఖాదర్ జిలాని, దస్తగిర్‌స్వామి వారి ఉరుసు మహోత్సవాన్ని గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. దస్తగిరి స్వామి దర్గా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పట్టణంలోని పెద్ద దర్గా పీఠాధిపతి హజరత్ ముహమ్మద్ ఫైజుల్ గఫ్ఫార్ షా ఖాద్రి చేతుల మీదుగా ఉరుసు జెండా ఊరేగింపును ప్రారంభించారు. ఊరేగింపు పట్టణంలోని పురవీధుల గుండా మేళ తాళాలలతో దర్గా చేరుకుంది. ఊరేగింపు అనంతరం గంధం ఎక్కించి ప్రత్యేక ఫాతెహ నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. సమీప ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. పూల చాదర్లు సమర్పించి ప్రత్యేక ఫాతెహ నిర్వహించారు.

నేటి నుంచి పశు గణాంకాల సర్వే ప్రారంభం

పులివెందుల రూరల్ : పులివెందుల డివిజన్ పరిధిలో ఈనెల 25వ తేదీ నుంచి 2025 ఫిబ్రవరి 28వ తేదీ వరకు దాదాపు నాలుగు నెలల పాటు పశు గణాంకాల సర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పులివెందుల డివిజన్ పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కె.మంగేశ్వరరావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ పులివెందుల డివిజన్ పరిధిలోని రైతులు, పశువుల యజమానులు తమ ఇళ్ల వద్దకు వచ్చే ఎన్యుమరేటర్లకు తమ పశువులకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని అందించాలన్నారు. వీటి ఆధారంగా ప్రభుత్వం నుంచి ప్రస్తుత పశుసంవర్ధక శాఖకు పశువుల అభివృద్ధికి నిధులు మంజూరవుతాయన్నారు. వివిధ పథకాలు రూపొందించడానికి, ప్రణాళికలు తయారు చేయడానికి చాలా అవకాశాలు ఉంటాయన్నారు. అంతేకాక పశువుల సంరక్షణకు ప్రభుత్వం ఏమేమి చేయాలో తగిన చర్యలు తీసుకుంటుందన్నారు.